30082024-MAI-04_Layout 1 8/30/2024 3:03 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

అన్నపూర్ణగా తెలంగాణ

సాంకేతికంగా ఎంత ముందంజ వేసినప్పటికీ మనదింకా వ్యవసాయిక దేశమే. ప్రజలకు ఆహారాన్ని సమకూర్చడమే కాకుండా అత్యధిక ఉపాధి కల్పించేదీ వ్యవసాయమే. దాని చుట్టూరా అభివృద్ధి అల్లుకొని ఉంటుంది. అందుకే, అన్నదాతను నిలబెట్టుకుంటే అన్నిరంగాలు నిలదొక్కుకుంటాయన్న ఆలోచనలతోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాగుకు పెద్దపీట వేశారు. రైతు అనుకూల విధానాల పరంపరకు తెరతీశారు. తెలంగాణ వ్యవసాయ ముఖచిత్రాన్నే మార్చేశారు. నెర్రెలు వారిన బీడు నేలల దాహార్తి తీర్చేందుకు కాళేశ్వరం వంటి కార్యక్రమాలతో అపర భగీరథాన్ని ఆవిష్కరించారు. ఉచిత కరెంటుతో ఊతమిచ్చారు. అప్పుల తిప్పలు తప్పించేందుకు రైతుబంధు తెచ్చారు. రైతుబీమాతో కుటుంబాలకు భరోసా కల్పించారు. ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు అందజేశారు. పుష్కలంగా ఎరువులు, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేశారు. సాగులో సమన్వయానికి రైతువేదికలు నిర్మించారు. చివరాఖరి ఎకరానికి నీరందించడమే కాకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తూ నమ్మకం పెంచారు. ఈ చర్యలన్నింటి ఫలితంగా సాగు తెప్పరిల్లింది. తెలంగాణ ఘనకీర్తి తేజరిల్లింది. అరకొర సాగుతో అలమటించిన రాష్ట్రం అన్నపూర్ణగా అలరారింది. ఆహారధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా ఎదిగింది. *2018-19 నుంచి 2023-24 మధ్యకాలంలో మన వ్యవసాయరంగం 16.42 శాతం వృద్ధిరేటు సాధించడమే ఇందుకు తార్కాణం.* కేంద్ర వ్యవసాయశాఖ తాజాగా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చిన గణాంకాలివి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గ సభ్యులు చేస్తున్న దుష్ప్రచారాలను తుత్తునియలు చేసే సమాచారమిది. కేసీఆర్ అనుసరించిన విధానాలే ఈ అపూర్వ ముందంజకు తోడ్పడ్డాయని చెప్పడం చర్విత చర్వణమే అవుతుంది.

అంతటి స్వర్ణయుగం చూసిన తెలంగాణలో ఇప్పుడు రైతును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నమ్మి నానవోస్తే పుచ్చి బుర్రలైనట్టుగా తయారైంది పరిస్థితి. రైతుబంధు కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సి వస్తున్నది. పెంచి ఇస్తామన్న సాగు సాయానికి భరోసా లేకుండాపోయింది. కక్షపూరిత రాజకీయాల ఫలితంగా ప్రాజెక్టులను ఆగమాగం చేయడంతో సాగునీళ్లకు గోస వచ్చిపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం గప్పాలు కొట్టుకుని టాంటాం వేసుకున్న రుణమాఫీ రైతులను దారుణంగా వంచించింది. ఇవన్నీ అలా ఉంచితే రైతుల పట్ల కనీస మర్యాద కూడా కరువైపోయింది, అడుగడుగునా అన్నదాతలకు అవమానాలు ఎదురవుతున్నాయి. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామని ఓ మంత్రి నోరుపారేసుకున్నారు. రుణమాఫీ కోసం రోడ్డెక్కితే గయ్యిమని లేస్తున్నారు. నిన్నటికి నిన్న సాక్షాత్తు వ్యవసాయ మంత్రి రైతుల మీద చిందులు తొక్కడం సర్కారు అసహన ధోరణికి పరాకాష్ఠ.

మాయమాటలు నమ్మి మోసపోయిన రైతులు ఇప్పటికైనా తన వారెవరో, పరులెవరో గ్రహించాలి. కడుపులో పెట్టుకొని చూసుకున్నదెవరు? కండ్లల్ల నిప్పులు పోసుకున్నదెవరు? అనేది పరకాయించాలి. బీఆర్ఎస్ పాలనలో సగర్వంగా తలలెగరేసిన రోజులు పోయి తలదించుకునే పరిస్థితి తెచ్చిపెట్టింది కాంగ్రెస్. మాటకారి, మాయదారి హామీలతో అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తే ఓటును చేజార్చుకున్న ఫలితమిది. మోసపోయి గోసపడుతున్న దైన్యమిది. కల్లబొల్లి కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సమయం ఆసన్నమైందని రైతులు గుర్తించాలి. అందుకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే సరైన అదును.

సుప్రీం ప్రశ్నలకు జవాబు లేని ఈడీ

టంకశాల అశోక్

ఢిల్లీ మద్యం పాలసీ కేసు విషయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ప్రమేయం ఉందనే ఆరోపణలకు సంబంధించి మొదటినుంచీ అర్థం కాని విషయాలు కొన్నున్నాయి. ఆమె ఒక సాధారణ మహిళ అయినట్టయితే ఇదంతా ఎవరి దృష్టినీ ఆకర్షించేది కాదు. కానీ, తను ప్రముఖురాలు గనుక తొలిరోజు నుంచే ఈ కేసు రెండు తెలుగు రాష్ట్రాలలో విపరీతమైన ప్రచారం పొందింది. ప్రతి చిన్న అంశం గురించి ప్రజలు చాలా చర్చించుకున్నారు. ఆ తొలి దశలోనే ప్రజలకు కొట్టవచ్చినట్లు కనిపించి, ఆశ్చర్యకరంగా తోచిన విషయాలు కొన్నున్నాయి. కవిత పేరును అభియోగ పత్రంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మొదటిసారి పేర్కొన్నది 2022 నవంబర్ 26వ తేదీన. కానీ అంతకు సుమారు నాలుగు నెలల ముందునుంచే కొన్ని పరిణామాలు కనిపించసాగాయి. కేసులో కవిత ప్రమేయం ఉందని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆగస్టు నుంచే ఆరోపించటం మొదలుపెట్టారు. కొన్ని ఆందోళనలు కూడా చేశారు. తెలంగాణపైన, కేసీఆర్ కుటుంబంపైన మొదటినుంచి కక్షగట్టిన ఒక కోస్తా పత్రిక, అదే ధోరణిలో పదే పదే చెప్పుడు వార్తలు రాస్తూ పోయింది. వాటిని ఇంగ్లీషులో ప్లాంటెడ్ స్టోరీస్ అంటారు. కవిత అరెస్టు, తనకు జైలు శిక్ష తప్పవని కూడా ఆ పార్టీలతో పాటు ఆ పత్రిక ప్రకటించింది.

ఇందులో ముఖ్యంగా గమనించవలసిందేమంటే, కవిత అరెస్టు మాట అట్లుంచి ఆమె పేరును కనీసం అభియోగ పత్రంలో ప్రస్తావించటమైనా తర్వాత నాలుగు మాసాలకు గాని జరగలేదు. ఆ తర్వాత ప్రాథమిక విచారణ అయినా మరొక నెల గడిచిన తర్వాత జరిగింది. అటువంటప్పుడు నాలుగు నెలల ముందే బీజేపీ, కాంగ్రెస్‌లకు, సదరు కోస్తా పత్రికకు ఈ విషయాలు ఏ విధంగా తెలిశాయన్నది రెండు రాష్ట్రాల ప్రజలు అనేకులు అంతుబట్టక ఆశ్చర్యపోయారు. ఒకవైపు ఇదంతా అంతకాలం పాటు జరుగుతుండగా కేంద్ర ఏజెన్సీ అయిన ఈడీ అధికారులు అవునని గాని, కాదని గాని ఏమీ మాట్లాడకపోవటాన్ని కూడా పలువురు గమనించారు. దీనంతటిని బట్టి కొన్ని అనుమానాలు ఆ తొలి దశలోనే బలంగా కలిగాయి. బీజేపీ, కాంగ్రెస్‌లు తెలంగాణలో తమకు సవాలుగా నిలిచిన టీఆర్ఎస్‌ను దెబ్బకొట్టదలిచాయి. సదరు కోస్తా పత్రిక లక్ష్యం కూడా అదే అయింది. అప్పటినుంచి అసెంబ్లీ ఎన్నికలకు తగిన సమయం ఉన్నందున బీఆర్ఎస్‌పై దాడికి ఇదొక మంచి ఆయుధం అవుతుంది. ఆ విధంగా ఆ పథకం అమలు మొదలైంది.

కవిత బెయిల్ దరఖాస్తు ఆగస్టు 27న సుప్రీం కోర్టు ఎదుట విచారణకు వచ్చినప్పుడు, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ఇరువురూ వేసిన అనేక సూటి ప్రశ్నలకు ఈడీ, సీబీఐ న్యాయవాదులు జవాబులు చెప్పలేకపోయారు. కొన్నింటికి డొంక తిరుగుడు సమాధానాలిచ్చారు. తరచూ తడబడ్డారు. ఒక్కోసారి తాము చేసిన వాదనలను ఇంకొకసారి తామే ఖండించుకున్నారు. ఈ విధమైన ధోరణికి న్యాయమూర్తుల చేత చీవాట్లు కూడా తిన్నారు. ఇదంతా జాతీయ మీడియా గమనించింది. వ్యాఖ్యానించింది. ఇంతకూ అనవచ్చేదేమంటే, కవిత పేరును ఈడీ వారు 2022 నవంబర్ 26న పేర్కొనటానికి నాలుగు నెలల ముందు నుంచే బీజేపీ, కాంగ్రెస్ వారు, సదరు కోస్తా పత్రిక ఆ విషయం మాట్లాడటానికి 'సమాచారం' ఎక్కడి నుంచి వచ్చిందనే ప్రశ్నపై ఆ ముగ్గురిని కోర్టులో నిలదీయగలిగి ఉంటే కొన్ని రహస్యాలు బయటికి వచ్చి ఉండేవన్నది ఆసక్తికరమైన మాట.

అధికార యంత్రాంగంలో ఏమి జరుగుతున్నదో ఒక్కోసారి కొంతమేరకు మీడియాకు, అధికార పక్ష సన్నిహితులకు లీక్ అవుతుండటం సహజం. కానీ, ఈడీ, సీబీఐ, ఇంటెలిజెన్స్ వంటి సంస్థల నుంచి సర్వసాధారణంగా జరగదు. ఎప్పుడైనా కొద్దిగా లీక్ అయి వార్తలకు, రాజకీయ ప్రచారాలకు ఎక్కితే ఆ సంస్థ అధికారులు వెంటనే జాగ్రత్త పడతారు. అందుకు ఖండన ప్రకటనలు కూడా ఇస్తారు. ఒక జర్నలిస్టుగా స్వయంగా ఢిల్లీలో దీర్ఘకాలం పాటు పని చేసిన నేను గమనించిన విషయాలివి. కవిత గురించిన వార్తల విషయమై ఇటువంటి బందోబస్తులేవీ ఏజెన్సీల వైపు నుంచి జరగకపోగా, ఆ వార్తలు ఏదో కొద్ది సార్లుగాక నెలల తరబడి సాగుతుండినా ఎటువంటి ఖండనలు గానీ, వివరణలు గాని, బందోబస్తు జాగ్రత్తలు గాని కన్పించలేదు. అది చాలదన్నట్టు మరింత వింతైన వార్తలు ఉరఫ్ లీకులు వస్తూపోయాయి. ఆ తీరు అంతా గమనించినప్పుడు అనుమానాలు సహజంగానే బలపడుతూపోయాయి. ఢిల్లీ, పంజాబ్ ఆప్‌తో పాటు తెలంగాణలో బీఆర్ఎస్ ఒకవైపు బీజేపీకి, మరొకవైపు కాంగ్రెస్‌కు కొరకరాని కొయ్యలుగా మారాయి. ఆ ప్రచారానికి సాధనంగా ఉత్తరాదిన 'గోదీ మీడియా' (మోదీ పేరును మార్చి, ఆయన గోడ్‌లో అనగా, ఒడిలో కూర్చున్న అని అర్థం) ఉండగా, తెలంగాణలో ఒక కోస్తా యాజమాన్య పత్రిక ఆ పాత్రను బాగానే పోషించింది. అందుకే అంటున్నది, ఈ 27న సుప్రీం కోర్టులో దర్యాప్తు ఏజెన్సీల న్యాయవాదుల తడబాట్లు వెల్లడించిన కథ సగం కాగా, ఈ ముగ్గురిని కూడా విచారించగలిగి ఉంటే కథ పూర్తయ్యేది.

మద్యం కేసులోని నిజానిజాలను అంతిమంగా సుప్రీంకోర్టు తేల్చుతుంది. 493 మంది సాక్షులు, 57 మంది నిందితులు, 50 వేల పేజీల డాక్యుమెంట్లు, ఈడీ, సీబీఐ అనే రెండు ఏజెన్సీలు, రెండు చార్జిషీట్లు ఉండే ఈ కేసు ఇప్పట్లో తేలేది కాదని స్వయంగా న్యాయమూర్తులన్నారు. అయితే, ఇదంతా ఒక విధమైన నేరారోపణలకు సంబంధించినది. ఈ మొత్తం వ్యవహారంలో దీనితో నిమిత్తం కలిగిన రాజకీయ కోణం ఒకటున్నది. ఉన్నట్లు పైన చెప్పుకున్న విషయాలను గమనించినవారికి తేలికగా అర్థమవుతుంది. అందువల్ల, ఈ రెండు కోణాలకు సంబంధించిన వాస్తవాలు కూడా ప్రజల ముందుకు రావాలి. ఇంకా చెప్పాలంటే ఇందులో రాజకీయ కోణమన్నది మన ప్రజాస్వామ్యానికి, జాతీయ పార్టీలనే వాటి ధాష్టీకానికి, ఫెడరలిస్టు ప్రాంతీయ పార్టీల మనుగడకు సంబంధించినది అయినందున ఆ ప్రశ్న మౌలికమైనది. కేసులో నిజాలు ఉండి సంబంధిత వ్యక్తులకు శిక్షలు పడితే అది ఆ వ్యక్తులతో ముగిసిపోతుంది. కానీ, ఆప్, బీఆర్ఎస్ వంటి ప్రాంతీయ పార్టీలను, జేఎంఎం, డీఎంకే, తృణమూల్ వంటి ప్రాంతీయ శక్తులను బీజేపీ, కాంగ్రెస్ వంటి సెంట్రలిస్టు, యూనిటరిస్టు పార్టీలు తమ గోదీ మీడియా తోడ్పాటుతో ధ్వంసం చేయబూనితే అది ప్రజాస్వామ్యానికి, ఫెడరలిజానికి ప్రమాదకరంగా మారుతుంది. ప్రాంతీయ ప్రజలు, దేశ ప్రజలు గ్రహించవలసిన విషయమిది. కవిత కేసుకు సంబంధించి ఈ విధమైన పన్నుగడలు లేనిపక్షంలో, నేరారోపణ పత్రాలలో కనీసం తన పేరు అయినా ప్రస్తావనకు రాని, అసలెవరూ వినని, నాలుగు నెలల ముందు నుంచే గాని, చివరికి ఈ ఆగస్టు 27న 165 రోజులు గడిచి ఆమె బెయిల్‌పై బయటకు వచ్చిన వరకు గాని ఈ శక్తుల తీరు ఈ విధంగా ఉండేది కాదు. అంతేకాదు, విడుదల ఉత్తర్వులు వెలువడినప్పటి నుంచి 24 గంటల తర్వాత సైతం వారి మాటలు, వ్యాఖ్యలు ఎంత వికృతంగా ఉన్నాయో చూస్తూనే ఉన్నాము. దీనంతటిని బట్టి కూడా స్పష్టంగా అర్థమవుతున్నది ఇందులోని రాజకీయ కోణం ఏమిటో. అందువల్ల ఈ రెండు కోణాలను కలిపి చూసినట్లయితే తప్ప అసలు విషయం బోధపడదు. పైగా, నేర కోణపు ఆరోపణలను ప్రేరేపించిందే రాజకీయ కోణం అనే భావన విస్తృతంగా ఉన్నప్పుడు.

> **చివరగా, బెయిల్ విచారణ సందర్భంగా ఇరువురు న్యాయమూర్తులు లేవనెత్తిన సూటి ప్రశ్నలను ఇప్పుడొక్కసారి ప్రస్తావించుకున్నట్లయితే, దర్యాప్తు సంస్థల విషయం మనకు బాగా బోధపడుతుంది. వారి ప్రశ్నలపై ఎటువంటి వ్యాఖ్యానాలు వేరుగా అవసరం లేదు కూడా. అవన్నీ అరచేతి ఉసిరిక వలె సూటిగా, క్లుప్తంగా, స్పష్టంగా ఉన్నాయి. వాటికి జవాబుగా ఆ సంస్థల లాయర్లు తడబడటం లేదా నిరుత్తరులు కావటం మినహా, తగిన వివరణ లేమీ ఇవ్వలేకపోవటమన్నది ఇందులోని అంతిమ విశేషం.**

ఆ ప్రశ్నలేమిటో ఇప్పుడు చూద్దాము. కేసులో కవిత పాత్ర ఉన్నట్లయితే అందుకు సాక్ష్యాధారాలేమిటి? ఎక్కడ ఉన్నాయవి? ఇంతకాలం ఇన్నిన్ని విచారణలు చేసి ఎందుకు చూపలేకపోతున్నారు? మరెవరో తనపై ఆరోపణలు చేసినట్లయితే కేవలం అటువంటి ఆరోపణల వల్లనే ఆమె నిందితురాలవుతారా? పైగా ఆరోపణలు చేసిన వారు స్వయంగా నిందితులైనప్పుడు? నిందితులలో మీరు ఎంపిక చేసిన కొద్దిమందిని అప్రూవర్లుగా మార్చుకొని కేవలం వారి వాంగ్మూలాలపై ఆధారపడి, ఇతర సాక్ష్యాధారాలు ఏవీలేకుండా ఒక వ్యక్తిని ముద్దాయిగా నిలబెడతారా? ఇన్నిన్ని విచారణలు, దర్యాప్తులలో కనీసం ఒక్క రూపాయి అయినా దొరకబట్టలేదేమి? సెల్‌ఫోన్ ఛాటింగ్‌లు, డేటాలను అవసరం లేనప్పుడు అందరూ తొలగిస్తారు. మేము (న్యాయమూర్తులం) కూడా ఆ పనిచేస్తాం. అది నేరమవుతుందా? ఫోన్‌ను ఫార్మాట్ చేయటం వేరు, ట్యాంపరింగ్ చేయటం వేరు. కవిత ఫార్మాట్ చేశారంటున్నారు గాని ట్యాంపరింగ్ చేశారన లేదు. అటువంటప్పుడు ఫార్మాటింగ్ తప్పెట్లా అవుతుంది? అసలు ఢిల్లీ ప్రభుత్వం మద్యం విధానాన్ని రూపొందించటంలోనే కుంభకోణం ఉందని ఆరోపిస్తున్నారు మీరు, ఇన్నాళ్లు గడిచినా ఆ కుంభకోణమేమిటో చెప్పలేకపోయారు. రుజువులు చూపలేకపోయారు. ఎందువల్ల? మీరనే కుంభకోణంలో కవిత పాత్ర ఎక్కడుందో కూడా చూపించలేకపోయారు. ఎందువల్ల? కనీసం ఒక్కటైనా చూపాలి గదా? విచారణలు ముగిశాయని మీరే అంటున్నారు. చార్జిషీట్లు దాఖలు చేశామని కూడా అంటున్నారు. అటువంటప్పుడు కవితను ఇంకా జైలులో ఉంచవలసిన అవసరం ఏమిటసలు? అంతా చూడగా మీ దర్యాప్తులు సక్రమంగా సాగుతున్నాయా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

న్యాయమూర్తులు ప్రస్తావించిన ప్రశ్నలు నిజానికి ఇంకా ఉన్నాయి. ఉదాహరణకు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బుచ్చిబాబు అనే వ్యక్తులకు డబ్బు చెల్లింపులలో ప్రమేయం ఉందని చెప్పిన ఏజెన్సీలు వారిని నిందితులుగా చేర్చకపోవటానికి కారణాలు ఏమిటని నిలదీశారు. అయితే, కేసు విచారణ వివరాలన్నీ ఇక్కడ అవసరం లేదు. దీనంతటిలోని ప్రధాన విషయాలు, విశేషాలన్నీ పైన పేర్కొన్న విధంగా ఇప్పటికే అర్థమవుతున్నందున అవేమిటో ప్రజలు బాగానే గ్రహించగలరు.

హైడ్రా.. వరమా? శాపమా?

బి.నర్సన్
9440128169

పాండవులకు విలువిద్య నేర్పిన ద్రోణాచార్యుడు.. చెట్టు చివరన పక్షి బొమ్మను కట్టి, దాని కన్నును ఛేదించమని అర్జునుడికి పరీక్ష పెడతాడు. 'నీకేం కనిపిస్తుంది అర్జునా!' అని ద్రోణుడు అడిగితే.. 'పక్షి కన్ను తప్ప ఏదీ కనిపించడం లేదు' అని అర్జునుడు అన్నాడని భారతంలో ఉంది. హైడ్రా కూల్చివేతలో ముఖ్యమంత్రి గురువైతే, కమిషనర్ గాండీవధారి. అక్రమ నిర్మాణాల కూల్చివేతే తప్ప దాని పూర్వాపరాలు, పర్యవసానాలు, ప్రజల లాభనష్టాలు హైడ్రా సారథికి అవసరం లేదు. పోలీసులది ఎప్పుడూ పెద్దపులి చూపే. పైగా వారికి కోర్టులు, తీర్పులు అంటే ఒక రకమైన అసహనం. ఎంతో కష్టపడి పట్టుకున్న నేరగాళ్లకు జడ్జీలు బెయిల్ ఇస్తారని కినుక కూడా. అదే సూత్రం హైడ్రా కమిషనర్ పాటిస్తున్నట్టుంది. కోర్టుకు వెళ్తే స్టే వస్తుందనే ఉద్దేశంతో కూల్చివేతల సమాచారం రహస్యంగా ఉంచుతున్నారు. ఏమైనా లీకులు ఇస్తే సీరియస్ యాక్షన్ ఉంటుందని సిబ్బందిని హెచ్చరిస్తున్నట్టు కూడా తెలుస్తున్నది. ఇలా న్యాయవ్యవస్థను విశ్వసించకుండా ఒంటెత్తు పోకడలతో ముందుకెళ్లడమంటే కోర్టులు, న్యాయశాస్త్రాల విలువను తగ్గించినట్టే అవుతుంది. ఇది పసిగట్టే హైడ్రాకు న్యాయస్థానం బిగింపులు తెచ్చింది.

హైడ్రా కొత్త కూల్చివేతల కథలను రోజువారీగా పత్రికలు, టీవీలు సీరియల్‌లా చెప్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరల్చడానికి వీలు లేనందున ప్రజా దృష్టిని మరల్చడానికి ప్రభుత్వం హైడ్రాను సృష్టించిందనే విపక్షాల మాటల్లో కూడా నిజం ఉంది. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రంలో చెరువుల చుట్టూ ఉన్న నిర్మాణాలను ఫటాఫట్ కూల్చివేస్తామని ఎన్నికలప్పుడే చెప్తే ప్రజల తీర్పు మరోలా ఉండేది. ఇక కాంగ్రెస్ హామీల విషయానికొస్తే.. సగం మంది రైతులు రుణమాఫీ అవ్వక ఆగమై రోడ్లెక్కుతున్నారు. రైతుబంధు ఊసే లేదు. కొత్తగా ఒక్క ఉద్యోగ ప్రకటన కూడా రాలేదు. ఆసరా పింఛన్లు పెరగలేదు. తులం బంగారం లేకున్నా అసలు లక్ష రూపాయలు అందక కల్యాణలక్ష్మికి కంట నీరే మిగిలింది.

ఇక హైడ్రా విషయానికి వస్తే ఈ కూల్చివేతలు ఇప్పట్లో ఆగేలా లేవు. వీటివల్ల చెరువుల పరిధిలోని అక్రమ నిర్మాణాలు తొలగిపోయి, వరద ప్రభావానికి గురవుతున్న ప్రజల కష్టాలు గట్టెక్కుతాయి. చెరువులు బాగుపడి, నిల్వ సామర్థ్యం పెరిగి, నీటి సమస్య తీరవచ్చు. హైదరాబాద్ వీధులు చెరువులను తలపించే రోజులు పోతాయి. వర్షాకాలం ట్రాఫిక్‌జామ్ పీడ వదులుతుంది. నగరం పూర్వకళను సంతరించుకోవచ్చని నగరవాసుల ఆశ. అయితే ప్రస్తుతం కూలుస్తున్న కట్టడాల్లో ఎక్కువగా ఫంక్షన్ హాళ్లు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయి. అవన్నీ ధనవంతులవే. వారికి ఈ నిర్మాణాలు కూలిపోవడం వల్ల పెద్దగా నష్టమేమీ ఉండదు. పైగా కన్వెన్షన్ల అద్దెల రూపంలో పెట్టుబడికి మించి రాబడి వచ్చి ఉండవచ్చు. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు తమ కబ్జాల గురించి నోరు మెదపడం లేదు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తుండటంతో అక్రమ నిర్మాణాలు కొన్ని బయటపడుతున్నాయి.

చెరువు పరిధిలో కట్టిన ఫామ్‌హౌజ్‌లు, వ్యాపార కేంద్రాలు కూల్చేశాక హైడ్రా దూకుడు నివాసిత ఇళ్లపై, అపార్ట్‌మెంట్లపై మొదలవుతుందా? అనే ప్రశ్న తలెత్తుతున్నది. అదే కనుక జరిగితే వాటిలో ఉంటున్న సామాన్యుల పరిస్థితి ఏమిటి? అధికారికంగా అన్ని రకాల అనుమతులు ఉన్నాయనే కారణంగా ఫ్లాట్లు కొన్నవారి గతేమిటి? గూడు కండ్లముందే కూలుతుంటే వారి గుండెలు ఆగిపోవా? నగరంలో చెరువులను ఆనుకొని వందల వెంచర్లున్నాయి. లక్షల జనాభా వాటిలో నివసిస్తున్నారు. చాలామంది 10-20 ఏండ్ల కిందటే వాటిని కొనుగోలు చేశారు. ప్రశాంతంగా ఉన్నవారి జీవితాల్లోకి ఇలా చొరబడితే వారిని కాపాడేదెవరు? ఇప్పటికే ఏ అర్ధరాత్రి, ఏ ముప్పు ముంచుకొస్తుందోనని వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. అదీకాకుండా చాలామంది ఇలాంటి ఇండ్లను బ్యాంకు లోన్ల ద్వారా కొనుక్కున్నారు. కూల్చివేతతో బ్యాంకు రుణం తీరిపోదు. అప్పుదారులు, హామీదారుల్లో చాలామంది ఉద్యోగులే అయి ఉంటారు. వారి శాలరీల్లో కోతలు ఆగవు. మరో ఇంటి కిరాయి తప్పదు. ఈ కబ్జా సామ్రాజ్యంలో వారి పాత్ర లేకున్నా శిక్షను భరించాల్సి వస్తుంది. దీనిపై ప్రభుత్వం సమాధానమేమిటి?

> **అక్రమ కట్టడాల్లో పాఠశాలలు, కళాశాలలు, దవఖానలూ ఉన్నాయి. వాటిలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏమిటి? కట్టిన ఫీజులు ఎవరు వెనక్కి ఇస్తారు? దవాఖానల్లోని రోగులు ఎటు వెళ్తారు? ఇలా ఎన్నో సమస్యలకు తక్షణ పరిష్కారం కావాలి. కూల్చేశాక ఎంత మాట్లాడినా ప్రయోజనం శూన్యం.**

అక్రమ కట్టడాల్లో స్కూళ్లు, కాలేజీలు, హాస్పిటళ్లు కూడా ఉంటాయి. వాటిలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏమిటి? కట్టిన ఫీజులు ఎవరు వెనక్కి ఇస్తారు? హాస్పిటళ్లలోని రోగులు ఎటు వెళ్తారు? ఇలా ఎన్నో సమస్యలకు తక్షణ పరిష్కారం కావాలి. కూల్చేశాక ఎంత మాట్లాడినా ప్రయోజనం శూన్యం. ముందు వెనుక ఆలోచన లేకుండా ఏదో ఘనకార్యం చేస్తున్నట్టు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వీటికి సమాధానం ముందు ఇవ్వాలి. నివాసాలకు ఎలాంటి నష్టం జరగదని హామీ ఇవ్వాలి. విద్యాలయాలు, దవాఖానలకు సమయమివ్వాలి.

18 ప్రాంతాల్లోని 166 అక్రమ కట్టడాలను హైడ్రా ఇప్పటికే నేలమట్టం చేసినట్టు తెలుస్తున్నది. ఆ శిథిలాలతో పాత యజమానికి సంబంధం ఉండదు. వాటి తొలగింపు ఎవరు చేపట్టాలి? వాటిని ఎక్కడికి తరలించాలి? వాటి కోసం ఎన్ని ఎకరాల స్థలం అవసరం? అందుకు అవసరమైన ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయి? తరలింపునకు అయ్యే రూ.కోట్ల ఖర్చును ఎవరు భరిస్తారు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానమివ్వాలి. ఖర్చును భరించడమెందుకని ఆ శిథిలాలను అలాగే వదిలేస్తే హైడ్రా లక్ష్యం నెరవేరదు. చెరువుల దురాక్రమణదారుల భరతం పట్టాల్సిందే. కానీ, పద్ధతి మాత్రం ఇది కాదు. ఒక పరిష్కారం కొత్త సమస్యలను తెచ్చి పెట్టకూడదు. దీని కార్యాచరణలో కమిషనర్ పాత్ర కీలకమైనది. ఈ వ్యవహారం న్యాయబద్ధంగా, ప్రశాంతంగా జరగాలంటే రాత్రికి రాత్రి చేపట్టే కూల్చివేతలను నిలిపివేసి ప్రజలను కలుపుకొని పోవాలి. వీలైతే ఒకరిద్దరు నిపుణులను సలహాదారులుగా నియమించాలి. వారితో ప్రాంతీయ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసి, తీర్మానాలు చేయించాలి. భూసేకరణ కోసం పత్రికా ప్రకటన ఇచ్చినట్టు.. ఎక్కడెక్కడ, ఎవరెవరివి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఇండ్లు ఉన్నాయో సవివరంగా తెలియజేయాలి. వారంతా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంటారనుకుంటే అది తప్పే. జడ్జీలు గుడ్డిగా నిర్ణయాలు తీసుకుంటారనుకుంటే వారిని అవమానించడమే. న్యాయవ్యవస్థ మద్దతు కోరాలి తప్ప దాని కన్ను కప్పకూడదు.

హైదరాబాద్ చెరువుల్లో సగానికి పైగా కబ్జాకు గురైనట్టు పలు నివేదికలు చెప్తున్నాయి. రిమోట్ సెన్సింగ్ సమాచారం ప్రకారం.. నగరం చుట్టుపక్కల 56 చెరువుల్లో 10,417 ఎకరాల విస్తీర్ణం 3,974 ఎకరాలకు కుదించుకుపోయింది. అంటే 60 శాతం దురాక్రమణ జరిగిందన్నమాట. మరి వీటన్నిటిని కూల్చుకుంటూ పోతే పూర్తయేదెన్నడు? నష్టపోయే అమాయకులకు ప్రత్యామ్నాయమేమిటి? చాలా నిర్ణయాలు హైడ్రా కమిషనర్ వైపు నుంచి ప్రజలకు తెలుస్తున్నాయి. అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలుంటాయని ఆయన ఎప్పుడో అన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులపై చర్యలు తీసుకొనే అధికారాలు హైడ్రాకు ఉన్నాయా? చెరువుల పరిధిలో స్థలాలు, ఇల్లు కొన్నవాళ్లు బిల్డర్లపై కేసులు పెట్టాలని కమిషనర్ అంటున్నారు. పెడితే ప్రయోజనమేమిటి? ప్రభుత్వ స్థలాలను పూడ్చేసిన వాహనాలను స్వాధీనం చేసుకుంటామని అంటున్నారు. ఇది అన్యాయం కాదా! ఇలాంటి విషయాలపై ప్రభుత్వమే మాట్లాడాలి. అధికారి శాసనకర్త కాదు. ఒక పెన్ను పోటుతో ఆయన ఉన్నపళంగా కేంద్ర సర్వీసులోకి వెళ్లవచ్చు. మిగిలేది కాంక్రీట్ గుట్టలు, నిర్వాసిత ప్రజలే. సమయానికి స్పందించకపోతే జరిగే లాభం కన్నా నష్టమే ఎక్కువ. ఈ నేపథ్యంలో ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉన్నది.

ఆయుష్ ఉద్యోగాల భర్తీ ఎప్పుడు?

యావత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్న ఆయుర్వేద వైద్యం తెలంగాణ రాష్ట్రంలో మాత్రం నాణ్యతా ప్రమాణాల కొరతతో రోగులను ఆగం చేస్తున్నది. మెడికల్ అధికారులను బోధనా సిబ్బందిగా వాడుకుంటుండటమే ఇందుకు ప్రధాన కారణమని రోగులు ఆరోపిస్తున్నారు. అయితే, 'ఆయుష్ అసిస్టెంట్ ప్రొఫెసర్' పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఎప్పుడో ఆమోదం తెలిపింది. నోటిఫికేషన్ సిద్ధమై కూడా ఏండ్లు గడుస్తున్నది. కానీ, ఆ నోటిఫికేషన్ మాత్రం విడుదల కావడం లేదు. ఆ నోటిఫికేషన్ ఎందుకు ఆగిపోయిందో ఉద్యోగార్థులకు సైతం అంతుచిక్కడం లేదు. రాష్ట్రంలో రెండు ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలున్నాయి. అయితే, రాష్ట్రంలో 36 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను రెండేండ్ల కిందట ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేశారు. ఆయుర్వేద విద్యనభ్యసించిన విద్యార్థులు సైతం వేల సంఖ్యలోనే ఉన్నారు. వీళ్లు నోటిఫికేషన్ కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగుల కోసం కాకపోయినా, ఆయుర్వేద వైద్య విద్యనభ్యసించే విద్యార్థుల కోసమైనా 'ఆయుష్ అసిస్టె